ప్రముఖులందు......

తులసి బాలకృష్ణ

గ్రూప్ ఫోటోలు, దండలు, వీడ్కోళ్లు

మాధవరావు మాష్టారి పాతిక సంవత్సరాల ఉపాధ్యాయ జీవితంలో-ఋతువుల్ని బట్టి మారే వాతావరణంలా, 'వాతావరణాన్ని' బట్టి మారే రాజకీయ నాయకుల్లా-సర్వ సామాన్యమయి పోయాయి. ట్రాన్స్ఫరంటే ఇల్లు మారినట్లు, కొత్త వూరుకి వాహ్యాళికి వెళ్లినట్లు వుంటుందాయనకు. 'ఏవూరైనా రెక్కాడితేనే డొక్కాడేదీ, నోరు మంచిదయితేనే ఊరు మంచిదయ్యేది' అంటారాయన. ఎన్నడూ ఏ రాజకీయ నాయకుడన్నా బెదిరిందీ లేదు-ఏ ప్రలోభాలకీ లొంగిందీ లేదు.

ఈ వూరొచ్చిన మొదటి రోజు పార్టీలో-.

"మీ గురించి నేను యిది వరకే విన్నాను మాష్టారూ. సరే, న్యాయానికి యివి రోజులు కాకపోయినా, ఇంకా ఏ మూలో మీ బోటి సిపాయిలు ఏ కొద్ది మందో మిగిలి వుండబట్టే మనదేశం, దేశంలోని విద్యావిధానం ఈ మాత్రమైనా మనగలుగుతున్నాయి. మీవంటి టీచర్లవల్లే సంవత్సరానికి స్కూలు మొత్తంమీద ఒక్క కుర్రాడయినా మంచి మార్కులు తెచ్చుకుని, స్కూలు పరువు కాపాడుతున్నాడు. మీరు మా స్కూలుకి రావడం మా అదృష్టంగానూ, వదులుకున్న స్కూలువారి దురదృష్టంగానూ భావిస్తున్నాను. బహుశః ఇంక మీరు ఈ వూరు వదిలే అవసరమేరాదని, మావూరు మీవంటి ఉపాధ్యాయుడిని వదులుకోదని గట్టిగా నమ్ముతున్నాను" అన్నారు హెడ్ మాష్టారు. మాధవరావు మాష్టార్ని ఎంతో సాదరంగా ఆహ్వానిస్తూ.

"కృతజ్ఞుడిని" అన్నారు మాస్టారు హృదయం పుష్పొంగిపోగా. ఆపైన, తనప్రక్కనే తనని అంటిపెట్టుకుని నిల్చున్న పాపని చూపిస్తూ, 'సార్-ఈ పిల్ల నాకూతురు-పేరు పద్మ. మీరు అనుమతిస్తే మన స్కూల్లోనే రెండవ తరగతిలో చేరుద్దామనుకుంటున్నాను." అన్నారు సవినయంగా.

"తప్పకుండా మాస్టారూ-మీ కంటేనా" అంటూ పిల్లవైపు నవ్వుతూ చూసారు హెడ్ మాస్టారు.

"లేకలేక కలిగిన పిల్లయిది. అభాగ్యురాలు-పుట్టుతూనే తల్లిని పోగొట్టుకుంది. దానికి తల్లి, తండ్రి నేనే. నాకు సర్వం అదే" అంటున్న మాస్టారి కళ్ళల్లో తళుక్కుమన్న వాత్సల్యాన్ని గమనించి, అన్నారు హెడ్ మాస్టారు, "తల్లి లేని పిల్ల అవడం ఆపిల్లకు దురదృష్టమయితే, మీవంటి గొప్పతండ్రికి బిడ్డ అవడం ఆపిల్ల పూర్వజన్మసుకృతం మాస్టారూ." అంటూ పాపని దగ్గరకు తీసుకుని, తల నిమిరారు.

పిల్లని పేరూ అవీ అడిగి తెలుసుకుని, ముద్దాడి, అన్నారు హెడ్ మాస్టారు, "మీరు ఈ వూరొచ్చింది ఈరోజే కాబట్టి, ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకోండి మాస్టారూ-రేపట్నుంచీ వద్దురుగాని"అని.

కాని మాస్టారందుకు అంగీకరించలేదు, "లేదుసార్. ఇప్పుడు విశ్రాంతి అవసరం లేదు నాకు. నేను పడ్డ పెద్ద శ్రమ ఏమీలేదు. పైగా చిన్న పిల్లలతో పాఠాలు చెప్పుకుంటూ కాలక్షేపం చెయ్యడమే గొప్ప విశ్రాంతి నాకు."

—అభినందిస్తూ, మెరిసే కళ్ళతో నవ్వేరు హెడ్ మాస్టారు. ఓ నిముషం తలపంకించి, ఏదో చెప్పబోయి, తటపటాయించి, చటుక్కున, "రేపట్నుంచీ మీకు క్లాసులు అప్పజెప్తాను. ఈ రోజుకి ఓ మీకు అభ్యంతరం లేకపోతే సుమా..ఆ మూడవ తరగతి మాస్టారు ఓ గంట ఆలస్యంగా వస్తానన్నారు ఆక్లాసు కుర్రాళ్లు స్కూలు పీకి పందిరేస్తున్నార్ట చిన్నపిల్లల క్లాసు అప్పజెప్పనని మీరు భావించకపోతే. ఆ తరగతికి " అంటూ చప్పరించారు.

"తప్పకుండాసార్. చిన్నపిల్లల క్లాసు నేను తీసుకుని చాలా నాళ్ళయింది. ఆ పసివాళ్ళతో గడపటం చాలా ఆనందంగాపుంటుంది" అంటూ కుర్చీలోంచి లేచి, కండువా భుజాన వేసుకుని, ఆ క్లాసుకి వెళ్ళడానికి తన సంసిద్ధత వ్యక్తపరిచారు మాస్టారు.

"పాపని ఇక్కడే వుంచండి. క్లాసుకి నేను పంపిస్తాను" అంటూ, ప్యూనుని పిలిచి, మాస్టారికి మూడవ తరగతి నీ సెక్షన్ చూపించమని పురమాయించారు హెడ్ మాస్టారు.

అయిదు ఎకరాల స్థలంలో విశాలమైన క్లాసు రూములున్న రాతికట్టడాలతో, వరుస క్రమంలో పెంచిన పెద్ద పెద్ద చెట్లతో ఆ స్కూలు చాలా అందంగానూ, విద్యనాశించి రాణించే బుద్ధిమంతులకి చక్కటి ఆలయంగానూ దృగ్గోచరమయ్యింది మాస్టారికి. ఫుట్‌బాల్ గ్రౌండ్‌కి అటువైపునున్నట్టుంది ఆతరగతి-గ్రౌండు లోంచి తీసుకు వెళ్తున్నాడు ప్యూను.

"ఇదుగో - చూడు బాబూ! నీ పేరేమిటీ?"

జ్యోతి-భాగ్యలక్ష్మి-లాటరీ కథల పోటీలో

రచయిత పరిచయం



తూర్పు గోదావరి జిల్లా ఇంజరంలో పుట్టిన నా జీవితం ఇప్పటివరకు సగం కాకినాడలోను, సగం రాష్ట్ర రాజధానిలోను గడిచింది. గత పది సంవత్సరాలుగా కథలు వ్రాస్తూన్న నాకు బహుమతులందుకోవడం కొత్తగా కాకపోయినా, ఈ బహుమతి మిక్కిలి ఆనందాన్ని, క్రొత్త స్ఫూర్తినీ ప్రసాదించింది.

నాటకాలలో నటించడమన్నా, దర్శకత్వం వహించడమన్నా ప్రాణం.

ఉద్యోగం—ఆంధ్రా బ్యాంకులో ఆఫీసరు.

ఎప్పటికయినా ఈ దేశంలో విప్లవం తథ్యమనే గట్టి నమ్మకం, దుష్టశిక్షణ ద్వారా కంటే, దుష్ట సంస్కరణ ద్వారా వచ్చే విప్లవం మరింత ఉన్నతమయినదవుతుందనే అభిప్రాయం గలవాడిని.

ఈరోజుల్లో కూడా మంచి రచనలు వస్తున్నాయని నమ్మే వాళ్ళలో నేనూ ఒకణ్ణి. తోటి బహుమతి గ్రహీతలకు శుభాకాంక్షలు; జ్యోతి సంపాదకులకు, న్యాయనిర్ణేతలకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

మానవజన్మ ఎత్తినందుకు ఈ పుణ్యభూమి ఘనత ప్రపంచ దేశాల్లో కీర్తింపబడటానికి — ఏనాటికయినా, ఉడతాభక్తిగా నయినా నేను ఉపయోగపడి, జన్మ సార్థకం చేసుకోవాలనేది ముఖ్యమైన కోరిక.

—తులసి బాలకృష్ణ

"వెంకన్న బాబూ"

"చూడు వెంకన్నా నువ్వు క్లాసుదాకా రానక్కర్లేదు. దూరంగా చూపించి వెళ్ళిపో"

"సిత్తం" అని మరో పాతిక గజాలు నడిచాక ఆగి, "అయ్యా - ఆ నేరేడు సెట్టుకి యిటు పక్క....పుర్ర సేతేపు వుంది సూడండి గుమ్మం-అదేనండి" అని చెయ్యి చాపి చూపించాడు వెంకన్న.

"సర్లె నువ్వెళ్ళిపో" అంటూ అటు నడిచారు మాస్టారు.

క్లాసుతో పాటు రణగొణధ్వని మరింత దగ్గరవుతోంది. 'పక్క క్లాసుక్కి, వాళ్ళకి ప్రశాంతంగా పాఠం వినడానికి ఏకాగ్రత చూపించడానికి ఈ గొడవ ఎంత అసౌకర్యంగావుందో కదా' అని చింతిస్తూ, వడి వడిగా నడిచారు మాస్టారు. గొడవ మధ్య ఓ పిల్లాడి గొంతు మరీ స్పష్టంగా వినిపిస్తోంది గట్టిగా—

"ఇప్పుడు....నేను చెప్పిన పద్యాన్ని మీరూ చెప్పాలన్న మాట. చెప్తార్రా వెధవల్లారా?"

"ఓ...."

"సరె చెప్పండి....కప్పు డప్పు

ప్రథమ బహుమతి పొందిన కథ

రంబు . ."

—నవ్వులు కేరింతలు—

"సాయిలెన్స్. చెప్పండ్రా వెధవ ల్లారా—కప్పు ఉప్పురంబు—"

"కప్పు ఉప్పురంబు—" అన్నాయి అన్ని గొంతులు.

"—నక్క పోలికనుండు—"

—నవ్వులు పగలబడి—

"తంతా వెధవల్లారా—ఊఁ చెప్పండి—నక్క పోలికనుండు—"

"నక్క పోలికనుండు—" అంటూ చప్పట్లు, నవ్వులు, కేరింతలు,—విచ్చల విడితనం-అడ్డూ అదుపులేని స్వేచ్ఛ—ఇంతలో—

"సైలెన్స్!!! "

—ఉరుము

—పిడుగు

—పైకప్పు విరిగి మీద పడ్డంత ధ్వని,

కుర్చీ మీద నిలబడి, అందరిచేత ఆకతాయి తనం పద్యం చెప్పిస్తూన్న కుర్రాడు త్రుళ్లిపడి, ముందుకు పడ్డాడు. అదిరిపడ్డ కుర్రాళ్ళందరూ అవాక్కయి పోయారు. అన్నితలలూ కీయిచ్చినట్లు గుమ్మంవైపు తిరిగాయి. గుమ్మానికి మధ్యగా నిలువెత్తు భారీ విగ్రహం-మిలట్రీ కమాండర్‌లా ఠీవిగా. ఆముఖం లో సముద్ర గాంభీర్యం, ఆ కళ్ళల్లో ప్రజ్వలిస్తూన్న తీక్షత,—శిలా ప్రతిమ లయ్యారు పిల్లలంతా. కుర్చీమీంచి ముందుకు తూలిపడ్డ కుర్రాడు తమా యించుకుని, ఆయన వంక పొగరుగా, ఓరగాచూస్తూ, యాంత్రికంగా నడుచు కుంటూపోయి, తన సీట్లో కూర్చున్నాడు.

బలంగా అడుగులేస్తూ ముందు కొచ్చారు మాష్టారు. కండువా కుర్చీచేతి మీద వేసి, అందర్నీ పరిశీలనగా చూసారు — చిన్నచిన్న పిల్లలు—లేత ముఖాలు అప్పుడే విచ్చుకున్న కలువ పువ్వుల్లా — ఆ ముఖాల్లో అమాయ కత్వం—ఆ మనసుల్లో దైవత్వం—ఆమనుషుల్లో ఏది బోధిస్తే అదే అల వరుచుకునే తత్వం—అందరి ముఖాల్లోకి గుచ్చి గుచ్చి చూస్తూవచ్చిన మాష్టారి చూపు ఆ అబ్బాయి దగ్గరకొచ్చేసరికి ఆగిపోయింది-తనని మింగేసేలా చూస్తూ న్నాడు ఆ అబ్బాయి—

"స్టేండప్!" ఆదేశించారు మాష్టారు.

—లేవలేదు ఆ కుర్రాడు. అలాగే, నిర్భయంగా చూస్తూన్నాడు.

"ఊఁ. స్టేండప్—లేచి—నిల బడు—" నొక్కిపలికారు.

అయిష్టంగా, విసురుగా లేచాడు.

"ఇలారా"

కదలలేదు.

"రా"-ఉరిమారు.

రెండడుగులు ముందుకు వేసాడు కుర్రాడు.

"నీపేరేమిటి?"

"రాజా"-ఠీవిగా నిల్చున్నాడు.

"ఊఁ—ఉప్పు కప్పురంబు పద్యం చేతులు కట్టుకుని అప్పజెప్పు"

"నేన్చెప్పను"

"చెప్పాలి-నీరేస్తాను లేకపోతే"

"అయితే — నాకొచ్చినట్లు చెప్తానంతే"

"చెప్పు"

క్లాసువైపుకు తిరిగాడు కుర్రాడు

చెప్పడానికి సిద్ధపడుతూ. తను చెప్పే విధానానికి క్లాసంతా నవ్వుతారని ముందే వూహించిన విజయగర్వంతో లోనుండి తన్ను కొస్తూన్న ఆనందాన్ని పళ్ల బిగువున బిగించి, వుక్కిరిబిక్కిరి అవుతున్నాడు. పిల్లల్లో కిసకిస నవ్వులు మొదలయ్యాయి.

"సైలెన్స్" గదిమారు మాస్టారు.

బుగ్గలో నాలిక గుచ్చుకుని, వెక్కిరింపుగా ఓరచూపులుచూస్తూ, చెప్పడం ప్రారంభించాడు కుర్రాడు — "కప్పు ఉప్పురంబు నక్కపోలిక —"

"ఆగు-ఏమిటా చెప్పడం? సరిగ్గా చెప్పు—ఉప్పు కప్పురంబు—"

"నా కొచ్చినట్లు చెప్తాను—నా యిష్టం—కప్పు ఉప్పురంబు—"

అంతే!!

"అమ్మా!!!" -క్రిందపడి, లేస్తూన్న ఆ కుర్రాడి ఎడమ చెంపమీద మాస్టారి కుడి చేతి వ్రేళ్ళ ముద్రలు—గులాబీ రంగులో తట్లుతేలాయి.

"అయ్యో అయ్యో—ఆరు ఎమ్మెల్లే గారబ్బాయిగారండీ బాబూ మాట్రుగారూ-అర్ని కొట్టేత్తన్నారేటండీ బాబూ—"

—రివ్వున గుమ్మంవైపు తిరిగారు మాస్టారు. భయం భయంగా చూస్తూ, నిలబడి వున్నాడు వెంకన్న అక్కడ.

"వెంకన్నా-నువ్వెందుకొచ్చావిక్కడికి?"

"ఎప్పుడూ గోలగోలగా వుండే క్లాసు సవిలెన్సుగా వుండే తలికి సరదా పడి సూద్దారనొచ్చాను మాట్రుగారూ—బాబూ—ఆరు ఎమ్మెల్లేగారి—"

"ఎవరబ్బాయి అయినా నాకనవసరం. పిల్లలంతా ఒక్కటే నాకు. తప్పుచేస్తే ఎవ్వర్నీ క్షమించను. ఒక్కడివల్ల క్లాసు, స్కూలు కూడా చెడిపోవచ్చు. నువ్వెళ్లు" అంటూ కుర్రాడి వైపుతిరిగి, "ఏం, ఈ సారన్నా సరిగ్గా చెప్తావా?" అనడిగారు వాడి కళ్ళల్లోకి తీక్షణంగా చూస్తూ.

వూ రిగాలొంగి పోయాడు వాడు. నీళ్లు నిండిన కళ్ళతో బెరుగ్గా చూస్తూ, 'చెప్తా' నన్నట్లుగా తలవూపాడు.

"గుడ్--అదీ బుద్ధిమంతుడి లక్షణం" అంటూ కుర్రాడిని దగ్గరకు లాక్కుని, వాడి బుగ్గమీద మాస్టారు ముద్దు పెట్టుకునే సరికి, వాడు బేలగా బావురుమన్నాడు. బుజ్జగిస్తూ నవ్వి, వాణ్ని ఎతుకుని ఒళ్లో కూర్చోపెట్టుకుని, "ఓరేయ్ పిల్లలూ-ఇప్పుడు మీకు వీడు ఉప్పు కప్పురంబు పద్యం చెప్తాడ్రా. మీరంతాకూడా వాడితో బాటే చెప్పాలి. సరేనా?" అన్నారు వాళ్ళల్లో భయాన్ని పోగొట్టి, ఉత్సాహాన్ని కలిగించేలా చల్లని చూపులు చూస్తూ.

"ఓ " అన్నారంతా ఉత్సాహంగా.

"అదీ... వెరీగుడ్—పాపం. వీడిందాకే చెప్పేవాడు సరిగ్గా. వాడు నేను కొత్తవాడిని కాబట్టి, ఈ స్కూలుకి పెద్ద క్లాసులకి పాఠాలు చెప్పడానికి వచ్చిన కొత్త మాస్టారిని అని తెలియక అలా దురుసుగా మాట్లాడాడంతే. వీడు చాలా బుద్ధిమంతుడసలు-నాకు తెలుసు. ఊ.. చెప్పరా నాన్నా. తప్పొస్తే నేను చెబుతాలే. చెప్పు"

చెప్పాడు కుర్రాడు తప్పులు లేకుండా.

పిల్లలంతా కూడా వాడితో బాటే చెప్పారు.

"వెరీగుడ్. మంచి పిల్లలు మీరు. అలా వుండాలి. చదువు నెప్పుడూ వెక్కిరించకూడదు. చదువంటే సరస్వతి. దేవుడిని, తల్లి దండ్రుల్ని, చదువుని, గురువుని ఎప్పుడూ హేళన చెయ్యకూడదు. అదిపాపం. అర్థమయ్యిందా?"

తల వూపారంతా అర్థమయ్యిందన్నట్టుగా.

"ఆఁ ఇప్పుడు మనం కొన్ని నీతి కథలు చెప్పుకుందాం అంటూ ఆయన చెప్పిన పంచతంత్రం కథల్ని ఎంతో ఆసక్తితో విన్నారు పిల్లలంతా.

o o o

భ్రుకుటి ముడిచి, ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ అన్నారు మాష్టారు, "ఏమిటీ, రాజా ఈ రోజు కూడా రాలేదా?!!" అని.

"అవును మాష్టారూ — ఈ రోజు అప్పుడే మూడో రోజు. భయంతో వాడికి జ్వరం వచ్చింది అంటున్నారు తోటి క్లాసు పిల్లలు. 'పదో తరగతి కొత్త మాష్టారు మా క్లాసుకొచ్చి, రాజా అల్లరిచేస్తే కొట్టారు' అని పిల్లలు ఆ ఎమ్మెల్యే గారికి చెప్పనే చెప్పారట. నేనుగాని, మరే మాష్టర్లుగాని, చివరకి హెడ్ మాష్టారుగాని వాడిని కొట్టడానికి కూడా జంకుతాం. మీరేమో వాడి గూబ పగల గొట్టి వదిలారట. ఇప్పటి వరకు ఆ ఎమ్మెల్యే గారేమీ అనలేదంటే — నాకెందుకో తుఫాను ముందు ప్రశాంతతలా అని పిస్తోంది" అంటూ భయాన్ని వ్యక్తపరిచారు రాజా క్లాసు టీచరు.

"మీరు మరేమీ భయపడకండి మాష్టారూ-ఆ అబ్బాయిని శిక్షించింది నేను. జరగబోయే నష్టాన్ని నేనొక్కణ్ణి భరిస్తాను. అయినా తప్పుగా ప్రవర్తించిన విద్యార్థిని శిక్షించడం మన విధుల్లో ఒకటి, అది మనం విస్మరిస్తే మన విధిని మనం సక్రమంగా నిర్వర్తించనట్లే. ఆ కుర్రాడికి త్వరగా స్వస్థత చేకూరాలని మాత్రం దేవుడ్ని ప్రార్థిస్తున్నాను."

o o o

గుమ్మం బయట కారు హారను చప్పుడు. వెంటనే "మాష్టారుగారూ" అన్న పిలుపు విని, పాపకి స్నానం చేయిస్తున్న వారల్లా ఉలిక్కిపడి, "ఎవరూ" అంటూ, చేతులు తుడుచుకుంటూ బయట కొచ్చాడు మాష్టారు.

"తవర్నోపాలి అయ్యగార్రమ్మంట్నారండి"-కాకీ బట్టల డ్రయివరు మొరటు గొంతు కరుగ్గా పలికింది.

"ఏ అయ్యగారు?"

"మా అయ్యగారే నండి-ఎమ్మెల్లే దొరగారు"

ఒక్క క్షణం చలన రహితులై నిలబడి పోయారు మాష్టారు ఆపైన "నేను వస్తాలే-నువ్వుపద" అన్నారు.

"అలాక్కాదండి. ఎంట బెట్టుకు రమ్మన్నారు. కార్లో ఎల్దారరండి."

ఒక నిముషం తల పంకించి ఆలోచించి, ఇప్పుడే వస్తా" అని లోపలకి నడిచి, పాపకి ఒళ్ళు తుడిచి, బట్టలు తొడిగి, "పద్మా-నువ్వు పక్కింట్లో ఆడుకుంటూండమ్మా-నేనొక్క అరగంటలో వస్తాను" అని చెప్పి, బట్టలు మార్చుకుని ఇంటికి తాళం వేసి, అయిష్టంగానే కారెక్కి, ఎమ్మెల్యే గారింటికి బయల్దేరారు మాష్టారు.

... ఆయన మస్తిష్కంలో అనేక

ఆలోచనలు ఎమ్మెల్యే కొడుక్కి ఎలా వుందో పాపం... ఆయన తన మీద కారాలు మిరియాలు నూరుతుండవచ్చు "బ్రతికి బట్ట కట్టాలని లేదా - బడుగు పంతులూ" అనడగవచ్చు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ చేతిలో పెట్టొచ్చు .."నాకొడుకుని కొట్టావుగా - ఆదెబ్బ రుచి నువ్వూ చూడం" టూ తన చెంప పగల గొట్టొచ్చు ఉద్యోగం వూడ పీకించవచ్చు ఇంకా అయితే మరే నేరమయినా మోపి, కటకటాల వెనక్కి తోయించవచ్చు.

"దిగండి మాష్టర్గారూ" అన్న డ్రైవరు మాటలకి ఈ లోకంలోకి వచ్చి, కారుదిగి, అతన్తో బాటే నెమ్మదిగా మెట్లెక్కి, అరుగు మీద నిలబడ్డారు మాష్టారు. అదొక విశాలమయిన భవంతి. చుట్టూతోట. ఎత్తుగా ప్రహారీ గోడ. "అలాకూర్చోండి మాష్టర్గారూ" అని కుర్చీవైపు చూపించి, లోపలకు వెళ్ళాడు డ్రైవరు, అలవాటు పడ్డ చొరవతో.

కూర్చోలేదు మాష్టారు. వారగా నిలబడే వున్నారు. ఆయన ఆలోచన అంతా ఇక ముందు జరగబోయే తంతు మీదుంది.

అయిదు నిముషాలు గడిచి వుండొచ్చు.

క్షణాలు లెక్క పెట్టుకుంటున్నారు మాష్టారు.

గుండె చప్పుడు చెవుల్లో ప్రతిధ్వనిస్తోంది.

ఆయన దృష్టి గుమ్మం వైపే వుంది-

-తెల్లటి ఖద్దరు బట్టల్లో నల్లటి, లావుపాటి ఎమ్మెల్యే రానేవచ్చాడు బయటకు నెమ్మదిగా, ఠీవిగా నడుచుకుంటూ.

వస్తున్న మనిషిని గమనించి, సర్దుకుని నిలుచున్నారు మాష్టారు. ఖంగారు' భయం, ఆందోళన లాంటి భావాలు తనలో ప్రవేశించకుండా జాగ్రత్త పడి, ప్రశాంత గంభీర వదనంతో నిశ్చలంగా నిలబడ్డారు.

తెల్ల బట్టల నల్ల ఎమ్మెల్యే తిన్నగా మాష్టారి దగ్గరకొచ్చాడు.

ఆయన కళ్ళల్లోకి సూటిగా చూసాడు.

చటుక్కున వంగి, ఆయన చేతులందుకుని, కళ్ళకద్దుకున్నాడు.

విస్తుపోయారు మాష్టారు.

"మాష్టారూ-నిజంగా మేము అదృష్టవంతులమండీ. ఇన్నాళ్ళకి మా అబ్బాయికి గురయిన మాష్టారు దొరికారు" అన్నాడు ఆనందంగా.

బొమ్మలా తెల్లబోయి చూస్తున్నారు మాష్టారు.

"ఆశ్చర్యంగా వుందా మాష్టారూ- నిజమేలెండి. అసలు మా రాజకీయ నాయకులంటేనే అందరికి ఓ విధమయిన భయమూ, ఇతర దురభిప్రాయాలూ వుంటాయి. మా పిల్లల్ని ఎవ్వరైనా ఏమయినా అంటే కయ్యానికి కాలు దువ్వుతామేమోనని భయపడుతుంటారంతా అనవసరంగా. కాని, మేమూ మనుషులమేగా మాష్టారు! మాకూ మా పిల్లలు బుద్ధిమంతులవ్వాలనీ వుంటుంది—కానీ దొంగలుగా, జూదగాళ్ళుగా, దేశద్రోహులుగా తయారవ్వాలని వుండదుగా. వాళ్ళు మంచి పిల్లలుగా తయారవడానికి ఎవరు సహకరించి ప్రయత్నించినా మేము వాళ్ళకి ఆజన్మాంతం కృతజ్ఞులమయ్యే వుంటాం"

-మాష్టారి కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి. గొంతు పెగల్లేదు. ఎమ్మెల్యే గారంటే మంచి గౌరవ భావం కలిగింది. అప్రయత్నంగానే చేతులెత్తి నమస్కరించారు. "నేను నమ్మలేక పోతున్నానండీ. ఇది కలా, నిజమా" అని మాత్రం అనగలిగారు.

ఎత్తుతూన్న ఆయన చేతుల్ని మధ్యలోనే అందుకుని నివారిస్తూ, అన్నారు ఎమ్మెల్యేగారు, "ఛ ఛ-మీరు నాకు నమస్కరించడమేమిటి? తప్పు తప్పు. నాకూ గురుతుల్యులే మీరు. అసలు మీ వృత్తే పవిత్రమయ్యింది, ఇక మాదో? అడక్కండి. మంచో చెడో ఏనాడో దిగాను. ఇక మునిగో తేలో ఈ ఘటం ఈ రంగంలో ఇలా వెళ్ళి పోవలసిందే. కాని నా కొడుకు మాత్రం నా రకం జీవితం గడపాలని కోరుకోడం లేదు నేను. భోగభాగ్యాలు లేకపోయినా ఫరవాలేదు. నీతిగా, న్యాయంగా, నిశ్చింతగా, నిరాడంబరమైన జీవితం గడిపితే అంతే చాలు. అన్నట్లు, మిమ్మల్ని నిలబెట్టే మాట్లాడేస్తున్నాను. రండి-కూర్చోండి"-

యాంత్రికంగా నడిచి, కుర్చీలో కూర్చుని, మంత్ర ముగ్ధులయినట్లు ఎమ్మెల్యే గారి మాటల్ని వింటూ వుండి పోయారు మాష్టారు.

మళ్ళీ చెప్పడం ప్రారంభించారు ఎమ్మెల్యేగారు.

"ఇద్దరు పిల్లలు పుట్టిపోయాక కలిగిన సంతానమండీ ఈ కుర్రాడు. వీడి తర్వాత సంతానం లేదు మాకు. పుట్టుక నుంచీ మహా అర్భకుడు. అందుకనే రెప్పెత్తి కోపంగా చూడం, పన్నెత్తి ఒక్క మాట అనం. దాంతో నిష్ప్రియో జకుడిగా, మొండి వెధవలా తయారవుతున్నాడు. వాడెంత రాక్షసుడిలా ప్రవర్తించినా, నేనేం చేస్తానో అనే భయంతో ఊళ్లో ఎవ్వరూ ఏమీ అనరు. స్కూల్లో మాష్టార్లు సరేసరి. "నేనేమీ అనుకోను-నయాన్నో భయాన్నో వీడ్ని దార్లో పెట్టండి" అంటే ఆ హెడ్మాష్టరు వీడి ముందు కళ్ళెర్ర జెయ్యాలంటేనే భయపడతాడు. ఇంక మామూలు మాష్టర్లేం లొంగదీయగల్రు?! ఏది ఏమయినా, వాడు మీ ఒక్కరికే లొంగాడు. వాడి ఏడేళ్ళ జీవితంలో వాడు తల వంచింది మీ ఒక్కరి దగ్గరే. మీ పేరు చెబేనే భయంతో గజగజ వణుకుతున్నాడు. మీ లాంటి మాష్టారు మావూరికి రావడం మా అదృష్టం. కేవలం భయపెట్టడమే కాదు. బుజ్జగించి, ఎంతటి కష్టమైన పాఠాన్నయినా అరటి పండు ఒలిచి చేతిలో పెట్టినట్లు మీరు బోధిస్తారని విన్నాను. కాని, మీరు పెద్ద తరగతులకే తప్ప చిన్న క్లాసులకి వెళ్ళరని తెలిసింది. నాదో కోరిక మాష్టారు! కాదనకూడదు. మీరు-స్కూలు అయిపోయాక అయినా సరే, రోజుకి ఓ రెండు గంటలపాటు వాడు మీ దగ్గర గడిపేలా చూడండి. ఆ రెండు గంటల్లో మీరు వాడికి పాఠాలే చెబ్తారో, పనులే చేయించుకుంటారో మీ యిష్టం. అందరూ వాడిని ఓ రాక్షసుడిలా కాక ఓ మంచి పిల్లాడిలా చూసేలా తయారు చేయండి వాడిని. మీ చేతుల్లో పెడుతున్నాను. వాడిని ఎమ్మెల్యేగా కాకుండా బిడ్డ బాగు కోరే కన్నతండ్రిగా మిమ్మల్ని కోరుకుంటున్నాను. కాదనకండి" అం

టూండగా ఆయన కళ్ళల్లో తడి తళుక్కుమంది.

మాష్టారి హృదయం సంతోష తరంగమయ్యింది. ఎవ్వరికీ భయపడక, ఎంత మందినో శిక్షించాడాయన. దానికి ప్రతిఫలం యిప్పటి వరకు ఆయనకు చెడే జరిగింది కాని, మంచి ఏనాడూ జరగలేదు.

కాని, ఈనాడు...

"తప్పకుండా .... నాదీ బాధ్యత" అన్నారు మాష్టారు.

"చాలు....అంత మాటన్నారంతే చాలు. మీ హెడ్మాష్టారి ద్వారా మీఘనత విన్నాను. రాతి ముక్కల్ని సైతం రత్నాలు చెయ్యగల ఘటికులట మీరు. ఈ రాజకీయాల్లో సతమతమవుతూన్న నేను ఇంక పిల్లాడి గురించి బెంగపెట్టుకోనక్కర్లేదు. కృతజ్ఞుడ్ని."

"శెలవు" అంటూ, ఎమ్మెల్యేగారెంత బలవంత పెట్టినా కారులో వెళ్ళడానికి అంగీకరించక కాలినడకన ఇంటిముఖం పట్టారు మాష్టారు.

ఇరుసు పాడయ్యో, బాట బాగు లేకనో ఆగి పోయేదికాదు కాలచక్రం. ప్రాణుల సుఖ దుఃఖాలతో సంబంధం లేకుండా, జనన మరణాలను పట్టించుకోకుండా తన డ్యూటీ తను నెరవేరుస్తూనే వుంటుంది. ఆ చక్రభ్రమణంలో గంటలు, రోజులు, నెలలు, సంవత్సరాలు సునాయాసంగా జరిగిపోతూనే వుంటాయి—

గడిచిన ఎనిమిది సంవత్సరాల కాలంలో చాలానే విశేషాలు జరిగాయి—

తాము ఈ వూళ్ళోనే వున్నంత కాలం మాష్టారెంత ప్రయత్నించినా తమ కుర్రాడు బాగు పడడని భావించిన ఎమ్మెల్యేగారు-కుర్రాడిని ఒక ఆదర్శ పౌరుడిగా, స్కూలు మొత్తానికే ఉత్తమ విద్యార్థిగా తయారుచేసి, తమకి అప్పజెప్ప వలసిందిగా ఒక పెద్ద బాధ్యతను మాష్టారి మీద మోపి, సతీ సమేతంగా

మీరు చదివారా?

రిలీజుకి ముందుగానే 6000 కాపీలు అమ్ముడైన ఆంధ్రుల అభిమాన రచయిత్రి

మాదిరెడ్డి సులోచనగారి డైరెక్టు నవల

ఎంత ఘాటు ప్రేమయో రు. 12-50

ముందుగా మీ దగ్గరలోని పుస్తకాల షాపులోకాని, న్యూస్ ఏజంటునుగాని అడగండి.
లేదా రు. 10-00 లు M.O. చేయండి. పోస్టు ఖర్చులు మేమే భరించి
మిగిలిన రు. 2-50 కి V. P. P. లో పంపుతాము.

డీలక్సు పబ్లికేషన్సు
ఏలూరురోడ్ • విజయవాడ-520 002

హైద్రాబాదు వెళ్లిపోయారు.

వాడికయ్యే ఖర్చు తప్పించి, ఒక్క పైసా ఎక్కువ తీసుకోనన్న షరతు మీద మాష్టారు వాడి బాధ్యతను ఎమ్మెల్యే గారి నుండి స్వీకరించారు.

అయితే—

రెండు సంవత్సరాల క్రితం—

కారు ప్రమాదంలో ఎమ్మెల్యేగారు, ఆయన భార్య మరణించారు. ఎవ్వరికీ తెలియకుండా, రాజకీయాల్లో తన స్థానం నిలుపుకోవడానికి ఆయన చేసిన అప్పులకే ఇల్లు, ఆస్థి అప్పులవాళ్ళ పరమయి పోయాయి. దాంతో రాజా బాధ్యత పూర్తిగా మాష్టారిమీదే పడింది. వెనుకంజ వెయ్యక, భగవంతుడి మీద భారం వేసి, ధైర్యంగా ఆ బాధ్యతని స్వీకరించారు మాష్టారు.

ఆయనకి తప్ప ఎవ్వరికీ వాడు ఆనాటికీ ఈనాటికీ తలపంచలేదు.

వాడు పరీక్షలు సరిగా వ్రాయని కారణంగా, వాడి పొగరు అణచడానికి నాలుగు, అయిదు తరగతుల్లో చెరొక ఏడాది ఆపు చేయించేసారు మాష్టారు. ఆకారణంగా ఇప్పటికి వాడు తొమ్మిదవ తరగతిలోవున్నాడు. పద్మ వాడిని మించి ఓ తరగతి ముందుంది. మాష్టారికి వీలు కానప్పుడు ఆమే వాడికి గురువు. చదువులో వాడిక్లాసులో ఫస్టు వాడే.

మాష్టారంటే ఎనిమిది సంవత్సరాల క్రితం మొట్ట మొదట సారిగా వాడికి కలిగిన భయం ఇప్పటికీ అలాగేవుంది. ఆయన కళ్లెర్రజేస్తే తల ఎత్తడు.

మాష్టారికి వూరంతా జేజేలు పలికింది. ఊరిపిల్లలకీ, పెద్దలకీ ఆయన దైవ సమానుడు. రాజాలాంటి తుంటరిని దారిలోకి తేగలిగిన మేధావి. ఇక ఆయనకి వేరే వూరు బదిలీ అయ్యే ప్రశ్నేలేదు. అయ్యే ప్రమాదమే వస్తే వూరు ఆశేవం అడ్డు పడేటట్లున్నారు.

o o o

ఈ రోజు—

స్థాణువై నిలబడ్డ మాష్టారి చేతిలో కాగితం, గాలికి అల్లల్లాడుతూన్న దీపంలా రెప రెపలాడింది. కళ్ళు పంక్తుల వెంట పరుగెత్తాయి—

"మాష్టారూ—

మీరే తెలివైన వారనుకుంటున్నారు కదూ? నన్నేదో ఉద్ధరించేసే ననుకుంటున్నారు కదూ? నా పొగరణిచేసే ననుకుంటున్నారు కదూ? అదంతా మీ వెర్రి! నాలో ఎంత మాత్రం మార్పు రాలేదు. నాకు అవసరమయినంత మట్టుకే మీ నుంచి నీతి పాఠాలు నేర్చుకున్నాను. మీరు నేర్పిన పాఠాలలో మీకే బుద్ధి చెప్పేరోజు కోసమే ఇన్నాళ్ళూ ఎదురు చూసాను. మీ వ్రేలితో మీకన్ను పొడిచే అవకాశం కోసమే తహ తహ లాడాను. అది ఇన్నాళ్ళకు దొరికింది.

చిన్నప్పట్నుంచీ కూడా నా మాటకి నాపద్ధతికి వ్యతిరేకంగా పలికే వారంటే నాకు విపరీతమయిన కోపం. నన్నుద్ధరించే నెపంతో మీరీవూళ్లో దాపురించక పూర్వం వరకూ నాకు మహారాజు భోగం సాగింది. ఊళ్ళో నా మాటకు, చేష్టకు తిరుగు లేదు. మీరే వచ్చివుండక పోతే మకుటంలేని మహారాజులా ఈ వూరుని ఏలి వుండే వాడిని. నా పాలిట శత్రువు మీరు. అందుకే నా నరనరాల్లో మీ మీద

అంతులేని ద్వేషం. అది బహిర్గతం చెయ్యాలంటే నా నోట్లోంచి మాటరాదు. మిమ్మల్ని చూస్తేనే దడ.

నన్ను రాజాలా పెంచక, బాగు పడాలంటూ మీ దగ్గర వదిలిన నా తల్లి దండ్రులంటే చెప్పలేనంత అసహ్యం నాకు. అందుకనే వాళ్లు చచ్చిపోతే కూడా నాకు కన్నీళ్లు రాలేదు.

మీ పాఠాలతో, నీతి బోధనలతో; విసిగించి, విసిగించి చంపారెన్నాళ్ళో. పూల బాటలో సాగవలసిన నా బాల్యాన్ని నిప్పుల పాలు చేసారు. మీరు నాకు గుణ పాఠం నేర్పాననుకున్నారు. మీకు వీలు కానప్పుడు మీ అమ్మాయిచేత పాఠాలు చెప్పించారు. నన్నెంతగా చిన్నబుచ్చాలో అంతగానూ చిన్నబుచ్చారు. కాని, అసలు సిసలు గుణపాఠం ఇప్పుడు నేను నేర్పుతున్నాను మీకు. నా చిన్నప్పుడు మొట్ట మొదట సారిగా మీరు నన్ను కొట్టిన దెబ్బ కంటే గట్టి దెబ్బ యిప్పుడు నేను కొడుతున్నాను మీకు. మీరు కల్లో కూడా వూహించివుండరు నా నుంచి ఈ దెబ్బని. "మీ అమ్మాయిని లేపుకు పోతున్నాను" బలవంతగా మాత్రం కాదు. "నేను ఈ క్షణమే ఎవ్వరికీ కనబడకుండా పోతున్నాను. నువ్వొకత్తివే నాకు కావాలి- వస్తావా" అన్నానంతే. ఏ బలవంతం లేకుండా తనంత తానై వస్తోంది నాతో. మీరు, మీ కూతురు నాకు చెప్పిన పాఠాల కంటే-మీకు ఏ మాత్రం అనుమానం రాకుండా, నా మీద ఆమెకు విపరీత మయిన మక్కువ కలిగేలా నేను మీ అమ్మాయికి నేర్పిన పాఠాలు గొప్పవి కావంటారా? నేను ఏది ఎలా చెప్తే అదే వేద వాక్కని ఇప్పటికయినా ఒప్పు కుంటారా? నేను ఏనాడో ముక్కుపచ్చ లారని రోజుల్లోనే ఆకతాయి తనంగా చదివిన "కప్పు ఉప్పురంబు నక్క పోలిక నుండు ." పద్యాన్ని, శిరను వంచి ఆ విధానంలోనే అంగీకరిస్తారా?

మాష్టారూ-మీకు తిరుగులేని దెబ్బ లియ్యాలనుకున్నాను. తీసాను. అంతే!! మీరు చెప్పే నీతులు, సూక్తులు అన్నీ నా విజయం ముందు బలాదూర్!!

• ఇట్లు, మీ ప్రియశిష్యుడు-రాజా!"

-ఉండేలు దెబ్బతిని, చావు బ్రతుకుల మధ్య కొట్టాడుతూన్న పక్షికి సపర్యలు చేసి, గాలిలో వదిలివేస్తే, అది పోతూ కంట్లో రెట్ట వేసిపోయిన పరిస్థితి....

నెమ్మదిగా వరండాలోని పడక కుర్చీలోకి చేరి, శూన్యంలోకి చూస్తూ తనలో అనుకుంటున్నట్టు అన్నారు మాష్టారు, "లేదురాజా! అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ నేను అనేది "ఉప్పుకప్పు రంబు ... అనే" అని.

o o o

అసురసంధ్య అయిపోయి కారు చీకట్లు కమ్ముతున్నాయి ఇలాతలాన్ని.

కరెంటు కూడా పోవడంతో పేటంతా కటిక చీకటి. మాష్టారు కుర్చీలోనుంచి లేవలేదు. నట్టింట దీపం వెలిగించ లేదు. అలాగే గుమ్మం వైపు చూస్తూ కూర్చుని వున్నారు.

మరో గంట గడిచింది.

ఆయనలో మార్పేమీలేదు.

అదే చూపు.

అకస్మాత్తుగా గుమ్మంవద్ద ప్రత్యక్ష మయిన రెండు ఆకారాల్ని చూసిన ఆయ

నలో ఉత్సాహం ఉబికి వచ్చింది గాని, బలవంతంగా అణచుకున్నారు. రాజా, పద్మ!!

పరుగుపరుగునవచ్చి, మాష్టారికాళ్ళని చుట్టేసి, భోరున ఏడ్చేస్తూ, "నన్ను క్షమించండి మాష్టారూ" అంటూ కన్నీళ్ళతో ఆయన పాదాలకు అభిషేకం చేసేడు రాజా.

మాష్టారు కదలలేదు. అలాగే కూర్చుని వున్నారు.

ముగ్ధలా నడుచుకు వచ్చి, మోకాళ్ళ మీద కూర్చుని, తండ్రి ముఖంలోకి దివ్యానుభూతితో చూస్తూండి పోయింది పద్మ.

"మీరే గెలిచారు మాష్టారు—మీరే గెలిచారు." వెక్కుతూ అన్నాడు రాజా. ఎంత సేపూ మిమ్మల్నెలా దెబ్బ తియ్యాలా అనే మూర్ఖంగా ఆలోచించాను గాని, మీ హృదయాన్ని నేను ఆక్రమించుకున్నంతగా ఈ ప్రపంచంలో ఎవ్వరూ, ఆఖరుకి మీ ఒక్కగానొక్క కూతురు కూడా ఆక్రమించుకోలేదని గ్రహించలేక పోయాను. పద్మని నా మాటలతో, పడగొట్టి నాతో లేపుకుపోయి, మీకు పాఠం నేర్పాననే అనుకున్నాను గానీ—ఆమె నాతో అంత ధైర్యంగా స్వతంత్రించి రావడానికి మీరే కారణం అని గ్రహించలేక పోయాను. ఈ ప్రపంచంలో అన్నిటికంటే అందరికంటే చివరకి మీ కంటే కూడా నాకే ప్రాధాన్యత యిచ్చి, నన్ను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన బాధ్యత మీ తర్వాత ఆమెకుందని, దేనినయినా, ఎవరైనా, మిమ్మల్నైనాసరే వదలి పెట్టడానికి సిద్ధపడి, నేను నాశనం కాకుండా కాపాడమని తనకి మీరు ఏనాడో ఉపదేశించారని, అందుకనే మీతో ఒక్కమాటయినా చెప్పకుండానే తను నాతో రావడానికి సిద్ధపడ్డానని పద్మ రైలులో చెప్పినప్పుడు-క్రిందకు దూకి ఆత్మహత్య చేసుకోవాలన్నంత సిగ్గేసింది మాష్టారూ, మీముందు నేనెంత?! మీరే నెగ్గారు మాష్టారూ. మీరు చెప్పిందే నాకు ఇక వేదవాక్కు.

"ఉప్పు కప్పురంబు నొక్క పోలిక నుండు
చూడ చూడ రుచుల జాడవేరు
పురుషులందు పుణ్య పురుషులు వేరయా

విశ్వదాభిరామ వినురవేమ-నిజంగా వేమనగారు చెప్పిన పుణ్య పురుషులు మీరే మాష్టారు ... మీరే ." అంటూ బావురు మంటూన్న శిష్యుడి ముఖాన్ని, అవ్యాజమైన వాత్సల్యంతో హృదయానికి హత్తుకుని, తలనిమురుతూ, నుదుట చుంబించి, కూతురికళ్ళల్లోకి అభినందిస్తూ చూసారు మాష్టారు.

అంతకంటే ఆనందమయమైన సమయం ఏముంటుందీ ఆయన జీవితంలో?! ❋

అంకితం

పులుల్లాంటి విద్యార్థులచేతకూడా
'దాసోహం' మాష్టారూ అనిపింపజేసుకుని,
బండల్లాంటి అనేక హృదయాల్ని
చదువుల తల్లికి దండలుగా సమర్పించిన
నా తండ్రి కీ. శే. తులసి రామమూర్తి
శాస్త్రిగారికి

-తులసి బాలకృష్ణ